యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షురాలిగా హేమలత

రామసముద్రం : జిల్లా యూటీఎఫ్ సహ అధ్యక్షురాలుగా రామసముద్రం ఈస్ట్ పాఠశాలకు చెందిన హెచ్ఎం హేమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండుసార్లు, అన్నమయ్యజిల్లాలో మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హేమలత మహిళా టీచర్ల సమస్యలపై నిరంతరం శ్రమిస్తూ పోరాటాలు చేసి అందరి మన్ననలు పొందారు. ఆమె ఎన్నికపై ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

19న మద్యం దుకాణ వస్తువులు వేలం

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశానుసారం....గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వినియోగించి, ప్రస్తుతం మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో ఉన్నటువంటి వస్తువులను నవంబర్ 19న బహిరంగ వేలం వేస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపో వారు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. బహిరంగ వేలంలో ఫ్రీజర్లు 65, ఇన్వర్టర్ విత్ బ్యాటరీ 67, క్యాష్ చెస్ట్ 75, స్కానర్స్ 240, క్యాష్ కౌంటింగ్ మెషిన్స్..152 ఉన్నవి ఉన్నట్లుగా వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 19వ తేదీ ఉదయం 10 గంటలకు మదనపల్లె మండలం వలసపల్లె జ్యూస్‌ఫ్యాక్టరీలోని ఐఎంఎఫ్ఎల్ డిపోకు చేరుకుని రూ.5వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయ పనివేళల్లో డిపో మేనేజర్‌ను లేదా స్టోర్ ఆఫీసర్ 9701777938, అసిస్టెంట్ మేనేజర్ 8639494220, డిపో మేనేజర్ 9866144462 నెంబర్లపై సంప్రదించాలన్నారు.

ఆధార్ కేంద్రాలు తనిఖీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పలు ఆధార్ కేంద్రాలను మంగళవారం మదనపల్లి డివిజినల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీవో) అమరనాథ్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రాల జారీ, ఇప్పటి వరకు ఎంత మందికి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు, ప్రజలు, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయాలపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఈవోఆర్డీ యోగానంద్ ఉన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుటే భర్తపై దాడి

మదనపల్లి: పోలీస్ స్టేషన్ ఎదుటే భర్తపై భార్య దాడి చేసిన ఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ అమ్మచెరువుమిట్టలో నివాసముంటున్న చైతన్యబాబు(44) టూవీలర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య సునీత, పిల్లలు భవిత (16), యశ్వంత్ (14) ఉన్నారు. భార్యాభర్తల మధ్య విడాకుల విషయమై తరచూ గొడవలు జరిగేవి. నెలరోజుల క్రితం భార్య సునీతతో గొడవపడి రింగ్ రోడ్డులో ఉంటున్న తల్లి లక్ష్మీదేవి వద్దకు భర్త చైతన్యబాబు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో భర్త ఇంటికి రాకపోవడంతో సోమవారం సునీత, అత్త లక్ష్మీదేవితో గొడవపడింది. దీంతో లక్ష్మీదేవి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంగళవారం ఈ విషయమై కుటుంబ సభ్యులందరూ వన్‌టౌన్ స్టేషన్‌లో సీఐతో మాట్లాడి తిరిగి వెళుతుండగా, స్టేషన్ ఎదుట భార్యాభర్తల మధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. సునీత ఆగ్రహావేశాలకు లోనై భర్తపై ఒక్కసారిగా ముష్టిఘాతాలు కురిపించింది. దాడిలో గాయపడిన చైతన్యబాబు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొంది మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కురబలకోట: మండలంలోని చేనేతనగర్‌కు చెందిన నాగేశ్వరి (26) సోమవారం రాత్రి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈమె భర్త రమణతో కలసి చేనేతనగర్‌లో కూలి మగ్గాలు నేస్తున్నారు. కుండీలు చుట్టలేదని భార్యను భర్త మందలించాడు. మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోని విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిధులు మురిగిపోతున్నాయ్..!

- మండల మీట్‌లు జరగనివ్వకపోవడంతో పైసా ఖర్చు చేయలేకపోతున్నారు
- ఆరు మండల పరిషత్‌లు వైఎస్సార్‌సీపీవి కావడంతో అభివృద్ధికి ఆటంకాలు



బి.కొత్తకోట మండల పరిషత్ కార్యాలయం

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో మండల పరిషత్ సమావేశాలను టీడీపీ శ్రేణులు అడ్డుకుని జరగనివ్వకుండా చేయడంతో మండలాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి నోచుకోలేకపోతున్నారు. ఎన్నికలయ్యాక అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాల్సిన టీడీపీ నేతలు మండలపరిషత్ సమావేశాలు జరగకుండా అడ్డుకుంటున్నారు. ఫలితంగా మండల పరిషత్ సమావేశాల్లో తీసుకోవాల్సిన నిర్ణయాలు, అభివృద్ధి, సమస్యలపై చర్చకు ఆస్కారం లేకుండాపోయింది. ఆరు మండల పరిషత్‌లు వైఎస్సార్‌సీపీ చేతిలో ఉండటంతో నిధుల మంజూరు చేసే అధికారం ఈ మండల పరిషత్ అధ్యక్షులకే ఉంది. పైసా ఖర్చు చేయాలన్నా, ఏ పని చేపట్టాలన్నా అధికారం వారిదే. టీడీపీకి చెందిన ఎంపీటీసీలు తక్కువ సంఖ్యలో ఉన్నారు.

ఖాతాల్లోనే నిధులు

మండల పరిషత్‌లకు 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు మంజూరయ్యాయి. ఎన్నికలు జరగడం, కొత్త ప్రభుత్వం రాకతో నిధులు ఖాతాలకే పరిమితమయ్యాయి. వాటిని సత్వరమే ఖర్చు చేశాక రెండో విడత నిధులు అందుతాయి. మిగతా నియోజకవర్గాల్లో నిధులు వినియోగం అవుతుంటే ఇక్కడ అందుకు విరుద్ధంగా వినియోగం లేదు. బి.కొత్తకోటలో రూ.80 లక్షలు, కురబలకోటలో రూ.17 లక్షలు, పెద్దతిప్పసముద్రంలో రూ.10 లక్షలు, ములకలచెరువులో రూ.45 లక్షలు, తంబళ్లపల్లెలో రూ.38 లక్షలు, పెద్దమండ్యంలో రూ.12 లక్షల నిధులు ఉన్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. అయితే పెద్దతిప్పసముద్రంలో రూ.80 లక్షల దాక ఉండొచ్చని పాలకవర్గ సభ్యులు అంటుంటే అధికారులు రూ.10 లక్షలే అని చెబుతున్నారు. దీనిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా వచ్చేనెలలో 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు విడుదల కానున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉన్న నిధులు ఖాతాల్లోనే మూలుగుతున్నాయి.

కమిషనర్ ఆదేశించినా అంతే..

15వ ఆర్థిక సంఘ నిధులను వెంటనే సద్వినియోగం చేసుకునేందుకు ఏఏ పనులు చేపడుతున్నారో నిర్ణయించి నివేదించాలని పీఆర్ కమిషనర్ ఆదేశాలిచ్చారు. అయితే తంబళ్లపల్లె నియోజకవర్గంలో మాత్రం నిధుల సద్వినియోగం జరిగే సూచనలు కనిపించడం లేదు. ఎంపీటీసీలు, ఎంపీపీలు హాజరైనా టీడీపీ నేతల ఒత్తిళ్లతో కోరం లేదంటూ వాయిదాలు వేస్తూ వస్తున్నారు. నియోజకవర్గంలోని పరిస్థితిపై జిల్లా అధికారులు కూడా స్పందించి చర్యలు తీసుకోకపోవడంతో మండల పరిషత్ పాలన పూర్తిగా పడకేసింది. ఫలితంగా నిధులు వినియోగం, పనుల మంజూరు ఆగిపోయాయి.

అడ్డుకునేందుకు ప్రయత్నాలు

మండల పరిషత్ సమావేశాలు ఇప్పట్లో జరిగే సూచనలు కనిపించడం లేదు. సమావేశాల నిర్వహణ తేదీ ప్రకటిస్తే అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగే అవకాశాలే ఎక్కువ. ఇదే పునరావృత్తం అయితే తంబళ్లపల్లెలో అభివృద్ధి పనుల లేక నిధులు వెనక్కు వెళ్లిపోయే ప్రమాదం ఉంది. ప్రజలకు అత్యవసరమైన తాగునీటి సరఫరా, బోర్ల మరమ్మతులు, అభివృద్ధి పనులకు ఖర్చు చేసే అవకాశం ఉండదు, సమస్యలు పరిష్కారం కావు. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పీలేరు : సదుం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతల మధుసూదన్‌రెడ్డి కుమారుడు జయంత్‌రెడ్డితో కిరణ్‌కుమార్‌రెడ్డి కుమార్తె ప్రణవి వివాహం స్థానిక ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. వివాహానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పీలేరు, వాల్మీకిపురం పార్టీ మండల కన్వీనర్లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, నీళ్ల భాస్కర్, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, నాయకులు నారే వెంకటరమణారెడ్డి, కేశవరెడ్డి, చక్రపాణిరెడ్డి, చక్రధర్, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత

కేవీపల్లె : మండలంలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ గఫూర్ తెలిపారు. మంగళవారం మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. పంచాయతీ వాహనాల్లో వేస్తే చెత్త సంపద కేంద్రాలకు తరలిస్తారని తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం కొరవడకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలో వెల్లువెత్తిన అర్జీలు

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ అధికారులు భూ సమస్యలపై నిర్వహించిన గ్రామసభలో రైతుల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. దీర్ఘకాలికంగా భూ సమస్యలు పరిష్కారం కాలేదని, భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, పాసు పుస్తకాలు మంజూరు చేయాలని రైతులు అర్జీలను అందజేశారు. గ్రామసభలో తహసీల్దార్ శ్రీరాములు నాయక్, డివిజనల్ సర్వేయర్ లక్ష్మీనారాయణ, డిప్యూటి తహసీల్దార్ ధనంజనేయులు, మండల సర్వేయర్ శ్రీవాణి, వీఆర్వో లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా సద్వినియోగం చేసుకోండి

పీలేరు రూరల్ : రబీ సీజన్‌కు సంబంధించి రైతులు పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఏవో రమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని రేగల్లు, బాలంవారిపల్లె గ్రామ పంచాయతీలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కోతకు వచ్చిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ వరి సాగు చేసే రైతులు ఎకరాకు రూ. 126 ప్రీమియం చెల్లిస్తే పంట బీమా రూ. 42 వేలు వర్తిస్తుందన్నారు. అలాగే వేరుశెనగకు ఎకరాకు రూ. 96 ప్రీమియం చెల్లిస్తే బీమా రూ. 32వేలు వర్తిస్తుందని తెలిపారు. డిసెంబర్ 15వ తేదీలోపు పంటబీమా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో నజీర్, వీఏఏలు జహీర్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలి

పీలేరు : విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని జిల్లా సపోర్టింగ్ ఆంధ్ర లర్నింగ్ ట్రాన్స్‌ఫార్మేషన్ జిల్లా కోఆర్డినేటర్ చిన్న బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించుటకు ఫిరికీ యాప్ ద్వారా గణితానికి సంబంధించి కొన్ని వీడియోల ద్వారా బోధనా పద్ధతిలో తగిన మార్పులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వై. లోకేశ్వర్‌రెడ్డి, బి. పద్మావతమ్మ, సీఆర్పీలు మురళీధర్‌రాజు, నాగరాజ, అశోక్, మాధవి, సిబ్బంది తాజూన్, శిరీష తదితరులు పాల్గొన్నారు

కేన్సర్‌పై విజయం స్కీనింగ్‌తో సాధ్యం

మదనపల్లె సిటీ: కేన్సర్ వ్యాధిపై విజయం సాధించాలంటే స్కీనింగ్‌తో సాధ్యమని మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణవేణి అన్నారు. మంగళవారం జనచేతన సంస్థ ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. కేన్సర్‌ను ముందస్తు పరీక్షలతోనే రక్షణ పొందగలరని తెలిపారు. ప్రతి ఒక్కరూ కేన్సర్ స్కీనింగ్ చేసుకున్నప్పుడే వారి ఆరోగ్యం వారి చేతుల్లో ఉంటుందన్నారు. 18 ఏళ్లు దాటిని ప్రతి ఒక్కరూ కేన్సర్ పరీక్ష చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనచేనత అధ్యక్షురాలు రజియా, ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జ్యోతి, అధ్యాపకులు గురుమూర్తి, వనజ, జనచేతన సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కే అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు

పెద్దతిప్పసముద్రం: 'ఎరువుల సొమ్ము మింగేసారు' అని ఈ నెల 6న సాక్షి పత్రికలో వెలువడిన కథనంపై వ్యవసాయ శాఖ, జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారులు స్పందించారు. మదనపల్లి వ్యవసాయ శాఖ ఏడీ శివశంకర్ మంగళవారం మాట్లాడుతూ ఎరువుల సొమ్ము విక్రయించి ప్రభుత్వానికి జమ చేయకుండా సొంత కు డబ్బు వాడుకున్న ఆర్ఎస్‌కే అసిస్టెంట్లను జిల్లా కేంద్రానికి పిలిపించి కఠినంగా హెచ్చరించామన్నారు. జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో సొమ్ము వేగవంతంగా జమ అవుతోందన్నారు. బకాయి సొమ్ము జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలువురు ఆర్ఎస్‌కే అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసామన్నారు. అదే విధంగా పెద్దతిప్పసముద్రం మండలంలోని తుమ్మరకుంట ఆర్ఎస్‌కే అసిస్టెంట్ ఎలాంటి సొమ్ము స్వాహా చేయలేదని, సదరు వ్యక్తి బకాయి లేకున్నా ఆన్‌లైన్‌లో మాత్రం బకాయి ఉన్నట్లు వస్తోంది. సాంకేతిక లోపాలను సవరించేందుకు ప్రత్యేక చొరవ చూపుతామని ఏడీఏ శివశంకర్ తెలిపారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

పెద్దమండ్యం: రైతులు ఆధునిక పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రా నాయక్ అన్నారు. మండలంలోని ముసలికుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు సాగుచేసిన వరి, వేరుశనగ, టమాటా పంటలను ఆయన పరిశీలించారు. పంటల సాగులో రైతులు పాటించాల్సిన పద్ధతులను ఆయన వివరించారు. రబీ వేరుశనగ పంట సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరపాలి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకులు

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలలో రెండు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో రెడ్డిమోహిత్ అనే విద్యార్థి మృతి చెందిన సంఘటన విదితమే. ఈ సంఘటపై సమగ్ర విచారణ జరపాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రాయచూర్ రవిశంకర్ కోరారు. మంగళవారం పౌర హక్కుల సంఘం నాయకులు గ్యారంపల్లె గురుకుల పాఠశాలను సందర్శించారు. అలాగే రెడ్డిమోహిత్ తల్లిదండ్రులను వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు అడుగుల డబుల్ డెక్కర్ మంచానికి టవల్‌తో ఉరి వేసుకుని కాళ్ళు నేలకు తాకుతూ విద్యార్థి మృతి చెందాడన్న అంశం పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. విద్యార్థి మృతి చెందడానికి పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కూడా స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరపడం తోపాటు బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి. రెడ్డెయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎం. రవిశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు వంగిమల్ల రమణయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులు లేక సచివాలయం ఖాళీ



ఖాళీగా ఉన్న బి.కొత్తకోట నాలుగో సచివాలయం

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేరువై సేవలు అందించిన సచివాలయాలు ఇప్పుడు సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ బి.కొత్తకోట నగర పంచాయతీకి చెందిన నాలుగో సచివాలయం. మంగళవారం కళాశాలలు, హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవల కోసం సచివాలయానికి వచ్చారు. అయితే విధులు నిర్వహించాల్సిన ఉద్యోగుల్లో ఒక్కరు కూడా సచివాలయంలో కనిపించలేదు. కార్యాలయం ఖాళీగా ఉంది. దీనితో విద్యార్థులు గంటల తరబడి సచివాలయం వెలుపల పడిగాపులు కాశారు. ఎంత సేపటికి ఒక్కరూ రాకపోవడంతో అక్కడే విలేజ్ క్లినిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిని నుంచి ఫోన్ నంబర్ తీసుకుని విద్యార్థులు సిబ్బందిలో ఒకరికి ఫోన్ చేశారు. ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవల కోసం నాలుగు రోజుల తర్వాత రావాలని చెప్పడంతో విద్యార్థులు అసహనానికి గురయ్యారు. సోమవారం కూడా వచ్చి వెనక్కి వెళ్లామని మళ్లీ నాలుగు రోజుల తర్వాత మళ్లీ రావాలంటే, ఇలా ఎన్నిసార్లు తిరగాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. చేసేదిఏమీలేక నిరాశగా వెనుదిరిగి వెళ్లిపోయారు.

100 శాతం సబ్సిడీతో మినీ గోకులం షెడ్లు



మాట్లాడుతున్న ఏపీడీ మధుబాబు

మదనపల్లె : ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు 100 శాతం సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వం మినీ గోకులం షెడ్లు మంజూరు చేస్తోందని ఉపాధిహామీ తంబళ్లపల్లె క్లస్టర్ ఏపీడీ మధుబాబు తెలిపారు. స్థానిక సీఎల్ఆర్సీ భవనంలో మంగళవారం మదనపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాలకు చెందిన రైతులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ...తంబళ్లపల్లె క్లస్టర్‌లోని కరువు మండలాలకు ఒకోదానికి 50, మిగిలిన మండలాలకు 20 చొప్పున మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్ల ఆవాసాలకు ఈ షెడ్లు ఐదురకాలుగా నిర్మించుకోవాలన్నారు. రెండు ఆవులకైతే రూ.1.25 లక్షలు, నాలుగు ఆవులకు అయితే రూ.1.85 లక్షలు, ఆరు ఆవులకు రూ.2.30 లక్షలతో షెడ్లు నిర్మించాలన్నారు. గొర్రెలు, మేకలకు రూ.2.30 లక్షలు, కోళ్లషెడ్లకు రూ.1.32 లక్షలు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రప్రభుత్వం రైతుల సంక్షేమానికి మినీ గోకులం షెడ్లు మంజూరు చేస్తోందని, వీటికి సంబంధించి రైతులు ఎవ్వరూ ఉపాధిహామీ సిబ్బందికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అలా ఎవరైనా డిమాండ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో సీఎల్ఆర్సీ కోర్సు డైరెక్టర్ చందన, ఏపీఓ సుబ్రహ్మణ్యం, వెంకటేష్, టెక్నికల్ అసిస్టెంట్ బావాజీ, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై అధికారుల ఆగ్రహం

బి.కొత్తకోట: ప్రధాన రహదారులపై హోటళ్లు, షాపుల నిర్వాహకులు ఆక్రమణలు పాల్పడటంతో నగర పంచాయతీ కమిషనర్ పల్లవి, సీఐ రాజారెడ్డి సీరియస్ అయ్యారు. మంగళవారం పోలీసులు, నగర పంచాయతీ సిబ్బందితో ఆక్రమణలపై చర్యలు చేపట్టారు. రంగసముద్రంరోడ్డు, బీరంగిరోడ్డు, పీటీఎంరోడ్డు, జ్యోతిచౌక్‌లో వాహనాలు రాకపోకలు సాగించాలంటే నగరాల కంటే దయనీయమైన పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం ట్రాఫిక్ స్తంభనతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీనితో ఈ రహదారులపై పరిశీలినలు జరిపిన అధికారులు షాపులు, హోటళ్ల యజమానులకు వార్నింగ్ ఇచ్చారు. తక్షణమే ఆక్రమణలను తొలగించాలని, లేదంటే కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. పీటీఎంరోడ్డులో చెక్క మండీలను శివారు ప్రాంతాలకు తరలించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఆస్పత్రి వద్ద కాలువను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న బంకులను తొలగించేందుకు రెండురోజులు గడువు ఇచ్చారు. బీరంగిరోడ్డుపై దుకాణదారులు తమ వ్యాపార సామగ్రిని ఉంచడంపై సీరియస్ అయ్యారు. తక్షణమే తొలగించాలని కోరారు. నగర పంచాయతీకి చెందిన కాలువలపై చిన్న ఆక్రమణ ఉన్నా తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు.

కళాశాలలో కలకలం..!

- సెక్యూరిటీ ఇన్‌చార్జిపై మూకుమ్మడి దాడి
- 13 మందిపై కేసు నమోదు



సీసీ ఫుటేజీలో కళాశాలలో దాడి దృశ్యం (ఫైల్)

కురబలకోట: ఒక్కడిపై పాశవికంగా మూకుమ్మడి దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని విశ్వం కళాశాలలో ఆలస్యంగా వెలుగు చూసింది. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ మంగళవారం వెల్లడించిన వివరాల మేరకు..మదనపల్లె-అంగళ్లు మార్గంలో ఉన్న ఈ కళాశాలలో సెక్యూరిటీ ఇన్‌చార్జిగా కురబలకోటకు చెందిన శ్రీకాంత్ పని చేస్తున్నారు. ఈనెల 7న కళాశాలలో ఫంక్షన్ జరిగింది. అదే రోజు సాయంత్రం కొందరు విద్యార్థులు డిగ్రీ కళాశాలకు చెందిన మరో గేటు నుంచి కాకుండా మెయిన్ గేటు ద్వారా బయటకు వెళ్లడానికి ప్రయత్నించారు. ఇందుకు సెక్యూరిటీ ఇన్‌చార్జిగా ఉన్న శ్రీకాంత్ అభ్యంతరం చెప్పారు. దీంతో విద్యార్థులకు ఇతనికి మధ్య మాటా మాటా పెరిగింది. వాగ్వాదంతో చిన్న సంఘటన చివరకు దాడికి దారితీసింది. శ్రీకాంత్‌పై విచక్షణా రహితంగా విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేశారు. బాధితుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం కోలుకున్నాడు. ఈ సంఘటనపై బాధితుడు ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీల పరిశీలనతో పాటు విచారణ అనంతరం 13 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంగళవారం తెలిపారు. ఇన్నాళ్లు ఈ సంఘటన కళాశాల అంతర్గత వ్యవహారంగా భావించారు. ఇందుకు సంబంధించి సీసీ ఫుటేజీలు బయటకు రావడంతో కలకలం సృష్టించింది.

సోషల్ మీడియా గొంతు నొక్కడం దారుణం

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: ప్రభుత్వం తప్పొప్పులను ఎత్తి చూపుతున్న సోషల్ మీడియా గొంతు నొక్కడం దారుణమని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన సోషల్ మీడియా ఎంతకు దిగజారి అప్పటి సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై దారుణంగా జుగుప్సాకరమైన పోస్టులు పెట్టారో, వ్యక్తిగత దూషణలు, అసభ్యకరమైన మాటలు ఇలా అన్ని రకాలుగా ఇబ్బంది పెట్టిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అలాంటి సమయంలో కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సోషల్ మీడియాపై కేసులుగానీ, ఆంక్షలుగానీ విధించలేదని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించి అరెస్టు చేస్తుండటం దారుణమన్నారు.

హౌసింగ్ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

రామసముద్రం : హౌసింగ్ నిర్మాణాలు 2025 మార్చి చివరిలోపు పూర్తిచేయాలని మదనపల్లె హౌసింగ్ డీఈ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని చెంబకూరు సమీపంలోని హౌసింగ్ లేఅవుట్‌లో గృహనిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారులతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న గృహాలు త్వరితగతిన పూర్తిచేస్తే వాటికి పూర్తిగా బిల్లులు చెల్లించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ భానుప్రసాద్‌తో నిర్మాణాలపై సమీక్షించారు. మదనపల్లె ఇన్‌చార్జ్ ఏఈ దీనదయాళ్‌రాజు, ఏఈ రాజేశ్వరి, డేటా ఆపరేటర్ లోకేష్ పాల్గొన్నారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం ముష్టూరు పంచాయతీ దిగువపల్లెకు చెందిన రమణ కుమారుడు రెడ్డిశేఖర్ (35) భార్యతో గొడవపడి మనస్థాపం చెందిన మంగళవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. ములకలచెరువు మండలం గుడిపల్లె పంచాయతీ కోటపల్లికి చెందిన పెద్దన్న కుమారుడు మల్లప్ప (55) తన కుమారుడు మాట వినడం లేదన్న మనస్థాపంతో ఇంటి వద్దే పురుగుల మందు తాగాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో కార్పెంటర్‌కు తీవ్ర గాయాలు

మదనపల్లె : విద్యుత్ షాక్‌కు గురై కార్పెంటర్ తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన గుర్రప్ప కుమారుడు చెన్నకేశవ(25) కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం పట్టణంలోని చౌడేశ్వరి ఆలయం సమీపంలోని మునెప్పకాలనీలోని బషీర్‌కు చెందిన నిర్మాణంలోని ఇంటికి పనులు చేసేందుకు వెళ్లాడు. ఇంటి ప్రధాన ద్వారం అమర్చుతుండగా, ఇంటికి పక్కనే ఉన్న విద్యుత్‌స్తంభం తీగ తగిలి విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ప్రమాదంలో శరీరం తీవ్రంగా కాలింది. గమనించిన ఇంటియజమాని బాధితుడిని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి, కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు.

ఎంపీడీఓలతో పోస్టల్ ఎస్పీ భేటీ

పెద్దతిప్పసముద్రం: చిత్తూరు పోస్టల్ ఎస్పీ బీ.లక్ష్మణ్ మంగళవారం మదనపల్లి సబ్ డివిజనల్ పరిధిలోని అన్ని మండలాల ఎంపీడీఓలతో భేటీ అయ్యారు. స్థానిక ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌తో ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, తపాలా సిబ్బంది సమన్వయంతో పోస్టాఫీసుల్లో ప్రజలు ఖాతాలు తెరిచేందుకు చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరయ్యే సంక్షేమ పథకాలు, రాయితీల లావాదేవీలను పోస్టాఫీసుల్లో సునాయాసంగా జరుపుకునే విధానాన్ని వివరించారు. ప్రజలు వారి ఆధార్ కార్డుతో పాటు రూ.300ల డిపాజిట్‌తో ఖాతా తెరచుకోవచ్చన్నారు. ఆయన వెంట ఏఎస్పీ నీలిమ, ఎస్పీఎం రాజారెడ్డి తపాలా సిబ్బంది ఉన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు క్రీడా పరికరాలు వితరణ

గుర్రంకొండ: మండలకేంద్రంలోని తెలుగు జెడ్పీహైస్కూల్‌కు మదనపపల్లెకు చెందిన వాసవీ మహిళా క్లబ్ వారు మంగళవారం స్థానిక జెడ్పీహైస్కూల్‌కు చేరుకొని క్రీడా పరికరాలు, సామగ్రిని పీడీ చింతిర్ల రమేష్‌కు అందజేశారు. ఈసందర్భంగా మహిళాక్లబ్ అధ్యక్షురాలు అనురాధ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా తెలుగు జెడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందింపజేయడానికి క్రీడా పరికరాలు తమ సంస్థ తరపున అందిస్తున్నామన్నారు.

సర్వీస్‌రూల్స్ అమలుచేయాలి

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ సెక్రటరీలకు ఏపీఎస్ఈబీ పాత సర్వీస్‌రూల్స్ అమలుచేయాలని ఏపీ గ్రామ/వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా గౌరవఅధ్యక్షులు సాంబశివ కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ప్రొహిబిషన్ పూర్తి అయిన ఇతర సచివాలయ ఉద్యోగులకు 01-07-2022 నుంచి అమలుచేసినట్లుగానే ఎనర్జీ అసిస్టెంట్ సెక్రటరీలకు నిబంధనలు వర్తింపజేయాలన్నారు.

ఆరోగ్యవనంగా నగరవనం పేరు మార్పు

మదనపల్లె : పట్టణంలోని బసినికొండలో కేంద్రప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసిన నగరవనంను, అటవీశాఖ ఉన్నతాధికారులు ఆరోగ్యవనంగా నామకరణం చేసినట్లు సబ్ డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు.